అధికారులా.. మజాకా..!



● అప్పుడు వైసీపీకి కొమ్ముకాసి.. ● ఇప్పుడు టీడీపీకి విధేయులంట ● బదిలీ కాకుండా ఉండేందుకు యత్నాలు

● నాయకుల ప్రసన్నానికి నానా తిప్పలు ● కొందరు అధికారులపై తీవ్ర ఆరోపణలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వ పాలనలో కొందరు అధికారులు తాము ప్రభుత్వ ఉద్యోగులమనే సంగతే మరిచిపోయారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న విషయాన్ని తుంగలో తొక్కారు. ప్రభుత్వ ఉద్యోగికి ఉండాల్సిన బాధ్యతలను నిస్సిగ్గుగా పక్కన పెట్టేశారు.

అధికార పార్టీ నాయకులు చెప్పింది చేయడమే ఉద్యోగం అనేలా పని చేశారు. ఐదేళ్ల పాటు ఎక్కడ పనిచేసినా అధికార పార్టీకి కొమ్ము కాశారు. ఒకానొక దశలో వీళ్లు అధికారులో?.. అధికార పార్టీ నాయకులో? తెలియక ప్రజలు అయోమయానికి గురయ్యారు. ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం మారిపోతే పరిస్థితి ఏంటనే భయం లేకుండా అధికారపార్టీలో అంటకాగారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని కలలు కన్నారు. తాను ఒకటి తలిస్తే.. దైవం మరోటి తలచినట్లు వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయింది.. గతంలో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత మెజార్టీతో కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టారు. ఇటువంటి అధికారులకు ఇప్పుడు పెద్ద చిక్కే వచ్చి పడింది. తాము పనిచేస్తున్న చోట నుంచి బదిలీ కాకుండా ఉండేందుకు ప్రస్తుతం అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు నానాతిప్పలు పడుతున్నారు. అవసరమైతే డబ్బు కూడా ఖర్చు చేస్తామని బహిరంగంగానే చెబుతున్నారు. ఇప్పుడు జిల్లాలో ఎక్కడ చూసినా ఇదే హాట్‌టాపిక్‌గా మారింది.



వైసీపీ అధికారులుగా పేరు

ఐదేళ్ల పాటు జిల్లాలో పలువురు అధికారులు వైసీపీ అధికారులుగా పేరు పొందారు. తమ వద్దకు వచ్చే ప్రజలను వైసీపీ, టీడీపీ వర్గీయులుగా విభజించి చూశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల పనులు కానీయకుండా సంవత్సరాల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పుకున్నారు. చివరికి ఆ పనులు చేయకుండా పెండింగ్‌లో పెట్టారు. బిల్లులు రాక కొందరు కోర్టులను సైతం ఆశ్రయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు చెబితేనే మీ పనులు చేస్తామంటూ బహిరంగంగానే చెప్పారు. దీంతో ఎందరో టీడీపీ వర్గీయులు ఆర్థికంగా చితికిపోయారు. ఇక తమ పనులు జరగవని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడమే మానేశారు. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో కొన్ని శాఖల అధికారులు తాము ప్రభుత్వ ఉద్యోగులమనే సంగతి మర్చిపోయి పనిచేశారు. అందులో ముఖ్యంగా హౌసింగ్ పీడీ, ట్రాన్స్‌కో ఎస్‌ఈ, డీఆర్‌డీఏ పీడీ, జిల్లా వ్యవసాయాధికారి, డీపీవోతో పాటు పలువురు తహసీల్దార్లు, ఎంపీడీవోలు ఉన్నారు.

● ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి పనితీరుపైన అనేక ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ఎమ్మెల్యే సిఫారసు చేసిన వాళ్లకే ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారని, విద్యుత్ స్తంభాల మంజూరులోనూ ఇదే విధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకుల రియల్‌ఎస్టేట్ వెంచర్లలో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఈయన పనిచేసిన కాలంలో జిల్లా వ్యాప్తంగా జరిగిన వ్యవహారాలపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

● గృహనిర్మాణ శాఖ పీడీపైనా అనేక ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ శాఖలో జరిగినన్ని అక్రమాలు, అవినీతి మరే శాఖలోనూ జరగలేదంటే అతిశయోక్తి కాదు. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన లక్షలాది రూపాయల విలువ చేసే సిమెంటు, ఇనుము, ఇసుకను ఆ శాఖలోని సిబ్బందే అమ్ముకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం జరిగి బిల్లులు చేసిన ఇళ్లకు సైతం మళ్లీ బిల్లులు పెట్టారు. జిల్లాలో ఇటువంటివి వేలాది ఇళ్లు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలన్నీ పీడీ కనుసన్నల్లో జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి.

● డీఆర్‌డీఏ పీడీపైనా అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈయనకు ఈ పదవిలో ఉండే అర్హత లేకపోయినా సీనియర్లు, రెగ్యులర్ అధికారులు ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఇతడిని ఈ సీటులో కూర్చోబెట్టారు. దీంతో ఈయన అధికార పార్టీ నాయకులు ఆడమన్నట్లు ఆడారనే ఆరోపణలు ఉన్నాయి. గత నెలలో జరిగిన ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా డ్వాక్రా మహిళల ద్వారా వైసీపీకి పనిచేయించారని, వైసీపీ సభలకు డ్వాక్రా మహిళలను తరలించారనే ఆరోపణలు ఉన్నాయి.

● ప్రస్తుత డీపీవోపైనా అనేక తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఐసీడీఎస్ పీడీగా పనిచేసినపుడు నిబంధనలకు విరుద్ధంగా అంగన్‌వాడీల నియామకాల్లో అక్రమాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 21 పోస్టులను భర్తీ చేస్తే అందులో ఒకటి కూడా మెరిట్ ప్రకారం కాకుండా కేవలం అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే కనీసం రోస్టర్‌ను కూడా పట్టించుకోకుండా పోస్టుల్లో నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈమె పనిచేసిన కాలంలో ఐసీడీఎస్ శాఖలో జరిగిన నియామకాలు, ఇతర వ్యవహారాలపై విచారణ జరిపించాలని పలువురు అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నారు.

● జిల్లా వ్యవసాయశాఖ పైనా అనేక తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్రాక్టర్లలో నిజమైన లబ్ధిదారులకు కాకుండా అధికార పార్టీ చెప్పిన వాళ్లకే ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. వీళ్లే కాకుండా జిల్లాలో పలువురు తహసీల్దార్లు, మండల పరిషత్ అధికారులు వైసీపీ సేవలో తరించారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ శాఖపైన అనేక తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకులు చెప్పిన వాళ్లకు ఇతరుల భూములను సైతం ఆన్‌లైన్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇంకా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అప్పట్లో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పుడు ప్లేట్ ఫిరాయింపు

అప్పట్లో వైసీపీతో అంటకాగిన అధికారులు పలువురు ఇప్పుడు ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారనే ఆరోపణలు ఉన్నాయి. తామూ టీడీపీకి విధేయులమేనని కేవలం తాము విధులు మాత్రమే నిర్వహించామని చెబుతున్నట్లు సమాచారం. తమను బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచితే మీరు చెప్పినట్లే నడుచుకుంటామని చెబుతున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రస్తుత అధికార పార్టీలోని ముఖ్య నాయకులు, నాయకుల అనుచరుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక్కడే ఉంచడం సాధ్యం కాకపోతే తాము కోరుకున్న చోటుకి బదిలీ చేయించమని అడుగుతున్నారు. ఇందుకు గత ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అమలు చేసిన పాలసీని అమలు చేస్తున్నారు. ఇక్కడ ఉండి వైసీపీకి చేశాము మరో చోటుకు మార్చండి మీరు చెప్పినట్లు వింటామని అడుగుతున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ ముద్రపడిన అధికారులను పూర్తి ప్రాధాన్యత లేని పోస్టుల్లో ఉంచారు. దాదాపు ఐదు సంవత్సరాలూ ఇలా కొందరు అధికారులు అప్రాధాన్య పోస్టుల్లోనే విధులు నిర్వహించారు.

అయితే ఇప్పుడు అటువంటి అధికారులకు ముఖ్యమైన స్థానాల్లో పోస్టులు రాకుండా గతంలో వైసీపీ జెండాను నిస్సిగ్గుగా మోసిన అధికారులే మళ్లీ కీలక పోస్టుల్లో ఉండాలని ప్రయత్నాలు చేయడం విశేషం.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషేక్ కిశోర్



వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

● పథకాల గురించి రైతులకు వివరించాలి

● కలెక్టర్ అభిషేక్‌కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 19: జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సిరికల్చర్, పశు సంవర్థశాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్, ఏపీఎంఐపీ శాఖల గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన అంశాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈసారి జిల్లాలో 65,300 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అధికారులు తెలిపారు. వేరుశనగకు సంబంధించి ఇప్పటి వరకు 53 వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ చేశారని, విత్తన పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. 48,500 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు కేటాయించారని, మిగిలినవి ఆర్బీకేల ద్వారా త్వరితగతిన రైతులకు ఇవ్వాలన్నారు. గత ఏడాది జిల్లాలో 5 వేల కోట్ల రూపాయల పంట రుణాలు రైతులకు ఇచ్చామని, ఈసారి కూడా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేసి బ్యాంకర్లు రైతులకు సహకరించాలన్నారు. జిల్లాలో చాలా వరకు పాడి రైతులు ఉన్నారని పశుసంవర్థకశాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో వాతావరణ మార్పుల వల్ల పశువులకు వచ్చే జబ్బుల గురించి వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జూలై 6వ తేదీ ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 20 వేల డోసులు పశువులకు వేయాలని ప్రణాళికలు సిద్ధం చేశాని, జూలై 7 నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాసాభివృద్ధి వారోత్సవాలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పశుసంవర్థకశాఖ జేడీ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్, పశుసంవర్థక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, సిరికల్చర్ జిల్లా అధికారి రాజశేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, మత్స్యశాఖ డీడీ సుస్మిత, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి గురుప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలపై కొరడా

● 9 మందికి రూ.24.24 లక్షల జరిమానా

ములకలచెరువు, జూన్ 19: ఇసుక నిల్వలపై అధికారులు కొరడా ఝుళిపించారు. ములకలచెరువు మండలం రాజుగారిపల్లె, గోళ్లవారిపల్లె, దేవళచెరువు సమీపంలోని పెద్దేరు కాలువ వద్ద ఇసుకను అక్రమంగా నిల్వ ఉండడంతో గత నెల 28వతేదీ ఆంధ్రజ్యోతిలో 'ఇసుకాసురుల ముందు చూపు' రాజుగారిపల్లె, దేవళచెరువు వద్ద భారీగా ఇసుక డంపులు అన్న శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

దీంతో గత నెల 29వ తేదీ మదనపల్లె డివిజన్‌కు చెందిన గనులు, భూగర్భ శాఖ సర్వేయర్ దుర్గాదేవి, సిబ్బంది, ఎస్‌ఈబీ సీఐ రామ్మోహన్, మండల స్థాయి అధికారుల బృందమైన ఎంపీడీవో పోలప్ప, ఎస్‌ఐ తిప్పేస్వామి, ఆర్ఐ అంజనేయులు అటవీ ప్రాంతంలో ఉన్న ఇసుక డంప్‌లను పరిశీలించి నివేదికలను కలెక్టర్‌తో పాటు గనులు, భూగర్భశాఖ ఉన్నతాధికారులకు పంపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 30వ తేదీ 9 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేసి సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. సంజాయిషీ సరిగ్గా ఇవ్వకపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో 9 మందికి రూ.24,24,000 జరిమానా విధించారు. ఇందులో శంకర్‌రెడ్డికి రూ.1,08,000, నాగరాజుకు రూ.2,70,000, షుకూర్‌సాబ్‌కు రూ.3,15,000, ఫక్రుద్దీన్‌సాబ్‌కు రూ.2,43,000, శ్రీనివాసులురెడ్డికి రూ.9,18,000, విజేంద్రకి రూ.45,000, రెడ్డెప్పరెడ్డికి రూ.1,89,000, రెడ్డిశేఖర్‌కి రూ.2,10,000, వెంకటరమణకు రూ.1,26,000 జరిమానా విధించినట్లు గనులు, భూగర్భశాఖ అధికారులు తెలిపారు.

పీలేరులో దారుణం

● అక్కకు వేధింపులు... ప్రశ్నించినందుకు తమ్ముడిపై వైసీపీ నాయకుల సామూహిక దాడి

పీలేరు, జూన్ 19: పీలేరు పట్టణం కావలిపల్లెలో బుధవారం దారుణం జరిగింది. అక్కను వేధిస్తున్న వారిని ప్రశ్నించినందుకు ఓ వైసీపీ నాయకుల కుటుంబం సామూహికంగా తమ్ముడిపై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పీలేరులో బుధవారం కలకలం సృష్టించిన ఈ సంఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం కావలిపల్లెలో టీడీపీ సానుభూతిపరుడైన టి.గవరయ్య రేషన్ షాప్ డీలర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతని మూడవ కుమార్తె తేజస్వి రేషన్ షాపులో తండ్రికి చేదోడువాదోడుగా ఉండేది. కావలిపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు, ఫీల్డ్ అసిస్టెంట్ అయిన బావాజీ రేషన్ షాపుకు వచ్చినప్పుడు తేజస్విని వేధిస్తుండేవాడు.

అప్పుడప్పుడు ఆమెకు అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టడమే కాకుండా వీధిలో ఎదురుపడినప్పుడల్లా తనను ప్రేమించమని వెంటపడేవాడు. దాదాపు రెండేళ్లుగా బావాజీ వేధింపులు కొనసాగుతుండగా ఆరు నెలల క్రితం ఆమె అతడి గురించి ఇంట్లోని వారికి తెలియజేసింది. దీంతో గవరయ్య, అతని కుటుంబసభ్యులు ఆ విషయాన్ని బావాజీ కుటుంబసభ్యులకు తెలియజేయడమే కాకుండా స్థానిక పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీ కూడా చేశారు. పెద్దమనుషులు, కుటుంబసభ్యుల ముందు మిన్నకుండిపోయే బావాజీ ఆనక మళ్లీ ఆమె వెంటపడేవాడు. బావాజీ సోదరుడు షాకీర్ వైసీపీలో నాయకుడిగా ఉంటూ అన్నమయ్య జిల్లా టూరిజం శాఖ డైరెక్టర్‌గా పనిచేసేవాడు. బావాజీ మరో తమ్ముడు షబ్బీర్ వైసీపీ పీలేరు పట్టణ యువజన సంఘ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. అధికార పార్టీ నాయకులు కావడంతో అప్పట్లో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గవరయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం బావాజీ తన కుమార్తెను వేధిస్తూ తనతో సహజీవనం చేయమని బహిరంగంగా పిలిచాడని, ఆ విషయం తెలిసి తాము మరోమారు అతని కుటుంబసభ్యులకు తెలియజేశామన్నాడు. బావాజీని అదుపులో పెట్టుకోవాల్సిన కుటుంబసభ్యులు అందుకు విరుద్ధంగా తమపై దాడికి యత్నించారని, దీంతో తాము బుధవారం ఉదయం పీలేరు పోలీసులను ఆశ్రయించామన్నారు. తాము లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, వారిని పిలిపించి మాట్లాడతామని సమాధానం చెప్పి పంపేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న బావాజీ కుటుంబసభ్యులు బుధవారం సాయంత్రం తన కుమారుడిపై కొడవలితో దాడి చేశారని, తలపై గాయం కావడంతో అతను కింద పడిపోయాడన్నారు. అడ్డుకోబోయిన తనను, తన భార్యపై కూడా దాడి చేశారని, తాము అక్కడి నుంచి తప్పించుకుని చికిత్స కోసం పీలేరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నామన్నారు. పోలీసులు తాము ఫిర్యాదు చేసినప్పుడు పట్టించుకుని ఉంటే దాడి జరిగేది కాదని గవరయ్య వాపోయాడు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ఆసుపత్రికి చేరుకుని గవరయ్య కుటుంబానికి సంఘీభావం తెలిపారు. విషయం తెలుసుకున్న పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ నరసింహుడు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని కేసు నమోదు చేశారు.



తీవ్రంగా గాయపడ్డ వెంకట జ్ఞానేంద్ర

ఫిర్యాదుదారులను చితక్కొట్టిన ఎస్‌ఐ

● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుకు డిమాండ్ ● పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన దళిత సంఘాల నాయకులు

నిమ్మనపల్లి, జూన్ 19: తమ కారు చోరీకి గురైందని ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులపై విచక్షణారహితంగా దాడి చేసిన ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నాయకులు బుధవారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ మొదటి నుంచి ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి వైసీపీ నాయకులతో అంటకాగుతూ పలువురిపై కేసులు పెట్టడంతో పాటు విచక్షణారహితంగా దాడి చేసేవాడన్నారు. అంతేకాకుండా ఈయన కలికిరి, పీలేరు, మదనపల్లి ప్రాంతాలలో ఎస్‌ఐగా పనిచేసినా ఇదే తరహాలో ప్రజలపై దాడులు చేసేవాడని తెలిసింది. ఈ నేపథ్యంలో మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ దళితవాడకు చెందిన రామకృష్ణ, ఎగువమాచిరెడ్డిపల్లెకు చెందిన శంకర తమ కారు చోరీకి గురైందని రెండు నెలల క్రితం ఫిర్యాదు చేశారు.



సీఐలకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

అయితే దొంగ దొరికాడని పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం రమ్మని పిలిచారని బాధితులు తెలిపారు. కాగా మంగళవారం బాధితులు రామకృష్ణ, శంకర పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తాము ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని ఎస్‌ఐకు తెలిపారు. ఇందుకు ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోతూ మీరు చెప్పినట్టు చేయాలేంట్రా అంటూ వారిని చితకబాదారు. వారు మాకు కేసు వద్దు, కారు కూడా వద్దు అని చెప్పి మొరపెట్టుకొన్నా వినకుండా వారిపై దాడి చేశారన్నారు. బుధవారం విషయం తెలుసుకున్న దళిత నాయకులు మూడు మండలాల నుంచి దాదాపు 100 మంది తరలివచ్చి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. విషయం తెలుసుకున్న సీఐలు సద్గురుడు, శేఖర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాలమహానాడు ఏపీ జనరల్ సెక్రటరీ యంలాసుదర్శన్ సీఐలతో మాట్లాడుతూ ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని లేకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన సీఐలు ఎస్‌ఐపై ఫిర్యాదు ఇవ్వాలని ఈ విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఫిర్యాదు చేయడానికే వచ్చిన వ్యక్తులను ఏవిధంగా కొడతారని, ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాకు న్యాయం జరగకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు మాణిక్యం, ప్రజాసేవా సంస్థ అధ్యక్షుడు సహదేవ, దళిత నాయకులు యర్రయ్య, ఇతర మండలాల నాయకుల పాల్గొన్నారు.

చౌక బియ్యం అక్రమదందా

వైసీపీ ఐదేళ్ల పాలనలో రేషన్‌మాఫీయా చెలరేగిపోయింది. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అడ్డదారుల్లో నల్లబజారుకు తరలించి కోట్లకు పడగలెత్తారు. వైసీపీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో వీళ్ల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇక చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నామమాత్రపు దాడులు చేస్తూ.. వారితో కలసి వాటాలు పంచుకుతింటూ కాలం వెల్లబుచ్చారు. ఈ అక్రమ దందాకు టీడీపీ ప్రభుత్వంలోనైనా అడ్డుకట్ట వేసి ప్రజాధనాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వైసీపీ అండదండలతో రెచ్చిపోయిన రేషన్ మాఫియా
- రూ.కోట్లకు పడగెత్తిన అక్రమార్కులు
- అధికారుల నామమాత్రపు దాడులు.. ఆపై వాటాలు
- ఇకనైనా అడ్డుకట్టపడేనా!


నామమాత్రపు తనిఖీ చేస్తున్న అధికారులు

మైదుకూరు, జూన్ 19: మైదుకూరు, ప్రొద్దుటూరు కేంద్రాలుగా చౌక బియ్యం అక్రమదందా జరుగుతోంది. దీంతో చౌక బియ్యం పంపిణీలో దాదాపు 60 శాతం పక్కదారిపడుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, అనంతపురం జిల్లాలోని ప్రాంతాల నుంచి కూడా రేషన్ బియ్యం సేకరించే మొత్తం మాఫియా మూలాలు మైదుకూరు, ప్రొద్దుటూరులోనే ఉండటం గమనార్హం. వీళ్లకు వైసీపీ అండదండలు పుష్కలంగా ఉండడంతో ఈ అక్రమదందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. పేదలకు ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులతో పాటు డీలర్ల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నట్లు సమాచారం. ఇంకొన్ని చోట్ల ఏకంగా రేషన్ బియ్యం గోదాముల నుంచి మిల్లులకు తరలిస్తూ ఈ అక్రమ దందా నడుపుతున్నారు.

పాలీస్ పట్టడం లేదా... నూకలు చేయడం

మధ్యవర్తులు ఇంటింటికి తిరిగి సేకరించిన చౌక బియ్యాన్ని బస్తాలకు పోసి రాత్రి వేళల్లో కొందరు రైస్ మిల్లులకు తరలిస్తుండగా.. మరికొందరు యంత్రాల ద్వారా నూకలు తయారు చేసి అమ్ముకుంటున్నారు. మిల్లర్లు బియ్యాన్ని పాలిస్‌పట్టి సన్నగా చేసి తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారు. కిలో రూ.15లకు కొనుగోలు చేసి వాటిని సన్నగా పాలిస్ బట్టి దాదాపు రూ.50లకు అమ్ముకుంటున్నారు. మరి కొందరు రేషన్ బియ్యాన్ని నూకలు చేసి హోటళ్లు, టిఫిన్ సెంటర్ల వారికి కిలో రూ.25 నుంచి 30 రూపాయల వరకు అమ్ముకుంటున్నారు.

ఇంటింటికి తిరుగుతూ కొనుగోళ్లు

రేషన్ బియ్యం ఇంటికి చేరిన వెంటనే.. ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యం కొనుగోలు చేసే వారి సంఖ్య వందల్లో ఉంది. మోటరు సైకిళ్లలో ఇంటింటికి తిరుగుతూ కిలో రూ.10 నుంచి 12 రూపాయలు చెల్లించి బస్తాల్లో నింపుకొని ఆటోల్లో మిల్లర్లకు తరలించి కిలో రూ.15తో అమ్ముకుంటున్నారు. ఈ రేషన్ బియ్యం అక్రమార్కులకు డీలర్లు, ఎండీయూ వాహనదారులు సహకారం అందిస్తున్నట్లు సమాచారం.

నామమాత్రపు దాడులు.. అపై వాటాలు

ప్రొద్దుటూరు, మైదుకూరు కేంద్రంగా రేషన్ మాఫియా దందాలు సాగిస్తున్నా అధికా రులు మాత్రం నామమాత్రపు దాడులు చేయడం.. ఆపై మిల్లర్ల యజమానులతో వాటలు పంచుకోవడం ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో కొనసాగింది. ఎవరైనా సరిపోని వారు సమాచారం ఇస్తే అక్కడికి వెళ్లడం.. సరుకు లేదనడం లేదా ఒకటి రెండు బస్తాలు పట్టుకుని రెవెన్యూ వారికి అప్పగించడం.. లేదా నామమాత్రపు జరిమా నాలు విధించి చేతులు దులుపుకోవడం జరుగుతోంది.

తాజాగా చూస్తే...

ఇటీవల మైదుకూరు పట్టణంలోని 2 ప్రధాన రైస్‌మిల్లులపై విజిలెన్స్, తూనికల శాఖ అధికారులు దాడులు చేసి రూ.1.75 లక్షలు జరిమానా విధించారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, పౌర సరఫరాలు, తూనిక కొలతలశాఖ అధికారులు ముకుమ్మడిగా దాడి చేసి.. బియ్యం బస్తాల నిల్వలు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.
బియ్యపు బస్తాలపై ప్యాకింగ్ తేదీలు, వాటి వివరాలు లేవని నిర్ధారించి తూనిక, కొలతల శాఖాధికారులు రూ.75 వేలు, మిల్లుకు సంబంధించి వివరాలతో కూడిన సూచిక బోర్డులు లేవని రూ.లక్ష జరిమానా విధించి వెళ్లి పోవడం గమనార్హం.

విలేజ్ హెల్త్‌సెంటర్‌ను తనిఖీ చేసిన ఢిల్లీ డాక్టర్లు


మాట్లాడుతున్న డాక్టర్ ప్రేమాన్స్ పాండ్య

చాపాడు, జూన్ 19: మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం ఢిల్లీలోని నేషనల్ క్వాలిటీ అసిస్‌మెంట్ కమిటీ డాక్టర్లు ప్రేమాన్స్‌పాండ్య, సిదార్థతుక్ర తనిఖీ చేశారు. వారు గ్రామస్థులతో మాట్లాడి డాక్టర్లు వైద్యసేవలు ఏ విధంగా మీకు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. స్థానిక డాక్టర్లు అయిన రాజేష్‌కుమార్, ఓబులేసులను అడిగి గ్రామంలోని ప్రజలకు ఎలా వైద్య సేవలు చేస్తున్నారని తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎన్ని మందులు వస్తున్నాయని.. సరఫరా కాని మందుల గురించి ఆరా తీశారు. ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది ఆశా కార్యకర్తల పనితీరును గురించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, బాబుల్‌రెడ్డి, మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారికి సహస్ర కలశాభిషేకం


కొలువుదీరిన శ్రీవారు, కలశాభిషేక కార్యక్రమంలో ఆలయ అర్చకులు

కడప (కల్చరల్) జూన్ 19: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలోని లక్ష్మీవేంకటేశ్వరుని దేవస్థానంలో ఈనెల 19 నుంచి 21 వరకు శ్రీవారికి కలశాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం సాయత్రం 5-30 గంటల నుంచి భగవద్విజ్ఞాపనం, విశ్వేక్సేనారాధన, భగవత్పుణ్యాహం, సహస్ర కలశాభిషేక సంకల్పం, రక్షాబంధనం, అంకురార్పణం, వాస్తుయాగం, యాగమంటప ద్వారా తోరణారాధనములు, వేద ప్రబంధ, స్తోత్రపాఠ పారాయణం, అఖండదీప స్థాపనం తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణమూర్తి, సాయి, తరుణ్ సారథ్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి తనిఖీ


అబ్జర్వర్ సుగుణాన్‌కు డాక్టర్ల వివరాలను చెబుతున్న సూపరింటెండెంట్ మల్లీశ్వరి


పులివెందుల రూరల్, జూన్ 19: కొత్తగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)ని బుధవారం డీఎంఈ, ఎన్ఎంసీ అబ్జర్వర్ సుగుణాన్ తనిఖీ చేశారు. అన్ని విభాగాలకు సంబంధించిన డాక్టర్లు దాదాపు 75 మంది ఇక్కడ వైద్యసేవలు అందించనున్నారు. ఇందులో దాదాపు 400కి పైగా పడకలు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి వచ్చిన డీఎంఈ, ఎన్ఎంసీ అబ్జర్వర్ అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మెడికల్ కళాశాల అనుమతులు పొందాలంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బృందం తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఎన్ఎంసీ బృందం తనిఖీ చేయాల్సిన సందర్భంగా ముందుగా అబ్జర్వర్ సుగుణాన్ పరిశీలించినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ మల్లీశ్వరి, డాక్టర్ విఘ్నేశ్వర్‌రావు తెలిపారు.

వయోవృద్ధులకు రక్షణగా సీనియర్ సిటిజన్ యాక్టు : జడ్జి

కడప(రూరల్) జూన్ 19: వయోవృద్ధులకు రక్షణగా సీనియర్ సిటిజన్ యాక్టు ఉందని... వయోవృద్ధుల పోషణను విస్మరించిన వారికి చట్టపర చర్యలు ఉంటా యని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని చౌడమ్మ వృద్ధాశ్రమాన్ని విజిట్‌చేసి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టం 2007 గురించి తెలియజేశారు. వృద్ధుల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించా రు. వృద్ధులు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే డీఎల్ఎస్ఏను సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రెహమాన్ సాహెబ్ మృతదేహం


రెహమాన్ సాహెబ్ (ఫైల్)

సంబేపల్లె, జూన్ 19: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని గుట్టపల్లి గ్రామం ఎస్.సోమవరం క్రాస్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎస్.అబ్దుల్ రెహమాన్ సాహెబ్ (65) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన అబ్దుల్ రెహమాన్‌సాబ్ కలకడ నుంచి సంబేపల్లె వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రైలు ఢీ.. గుర్తు తెలియని మహిళ మృతి



సిద్దవటం జూన్ 19: మండలంలోని కనుమలోపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గూడ్సు రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈమె వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని.. ఎత్తు 5.5 అడుగులు, చెక్ డిజైన్ కలిగిన టెర్రీకాటన్ చీర, మెడలో ఎరుపు గోల్డ్‌కలర్ కలిగిన పూసల దండ, దానికి అంజనేయస్వామి తాయుత్తు కలదు. ఆచూకీ తెలిసిన వారు 9440900811 నెంబ ర్‌కు ఫోన్ చేసి తెలియపరచాలని కడప రైల్వేస్టేషన్ ఎస్ఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


జంగంరెడ్డిపల్లిలో బాధితుల డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

సింహాద్రిపురం, జూన్ 19: జంగంరెడ్డిపల్లిలో గత కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదా పరిష్కారం కాకపోవడంతో మనస్థాపంతో అదే గ్రామానికి చెందిన క్రిష్టపాటి కళావతి బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లో కెళితే... జంగంరెడ్డిపల్లిలోని సర్వే నెంబర్ 40లో గత కొన్ని సంవత్సరాల నుంచి క్రిష్టపాటి కళావతి, క్రిష్ట పాటి నడిపి రోసిరెడ్డికి ఒక ఎకరా పొలం సంబంధించి తగా దా నడుస్తోంది. ఈ సమస్యపై కోర్టును సైతం ఆశ్రయించారు. అయితే రోసిరెడ్డి ఎక్స్‌కవేటర్ సాయంతో పొలంలో పనులు చేస్తుండగా ఆ భూమి తమదని కళావతి అడ్డుపడింది. అయినా వినకుండా పనులు అలాగే చేశారు. దీంతో కళావతి మనస్థాపానికి గురై ఇంటికి వచ్చి చీనీ చెట్లకు ఉపయోగించే క్రిమిసంహారక మందును తోట వద్దకు తీసుకెళ్లి అక్కడే తాగింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు 108 సహాయంతో పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం-తహసీల్దార్

భూ వివాదానికి సంబంధించి ఇరువురి మధ్య 20 సంవత్సరాల నుంచి తగాదా నడుస్తోంది. కళావతి అనే మహిళ విషద్రావణం తాగిన సమాచారం తెసిన వెంటనే ఆ గ్రామానికి వెళ్లి ఇరువురిని విచారించి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను పరిశీలించాం. పూర్తిస్థాయి నివేదికను పులివెందుల ఆర్డీఓకు అందజేస్తామని తహసీల్దార్ భీమేశ్వరరావు వివరించారు. ఆర్ఐ షేక్షావలి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కడప నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప (మారుతీనగర్) జూన్ 19: పౌర్ణమి సందర్భాన్ని పురష్క రించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో నుంచి ఈనెల 20వ తేదీ గురువారం రాత్రి 8 గంటలకు కడప డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇందులో పెద్దలకు టిక్కెట్ రూ.1050, పిల్లలకు రూ.570గా నిర్ధారించారు. సీట్లు రిజర్వేషన్ చేసుకోదలచినవారు ఆన్‌లైన్ ద్వారా కానీ, లేదా కడప బస్టాండు వద్ద గల రిజర్వేషన్ కౌంటర్ ద్వారా చేసుకోవాలని డిపో అధికారి డిల్లీశ్వరరావు కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆర్టీసీ బస్సుల వల్ల కలిగే ఇబ్బందులు, సమస్యలు, ఆదాయం పెంచుకోవడానికి సలహాలు, సూచనలకు వీలుగా ఈనెల 20వ తేదీ గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయ ల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. ప్రయాణీకులు ఏదేని సమ స్యలను నివృత్తి చేసుకునేందుకు 9959225774 అనే నెంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల తరలింపును విరమించుకోవాలి

- రాయసీమ విద్యావంతుల వేదిక నేతలు


మాట్లాడుతున్న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

ప్రొద్దుటూరు, జూన్ 19: ఎన్డీయే కూటమి ప్రభుత్వం కర్నూలు నుంచి ప్రభుత్వ కార్యాలయాలు తరలించే ప్రయత్నాలను విరమించుకోవాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నేతలు మహమూద్, వరలక్ష్మీ, పద్మలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హోమస్‌పేటలోని సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాయలసీమ ప్రాంతానికి అభివృద్ధిలో ప్రధాన్యత ఇస్తారని సీమ ప్రజలంతా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. అందువల్లే ఎన్డీయే కూటమికి ఈ ఎన్నికల్లో రాయలసీమలో అత్యధిక సీట్లు కట్టబెట్టారన్నారు. కానీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాచమలసీమ హక్కులను విస్మరిస్తూ కర్నూల్ నగరంలో ఏర్పాటు చేసిన మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు కార్యాలయం, ఎలక్ట్రిసిటి రెగ్యులెటరీ అథారిటీ కార్యాలయాలను అమరావతికి తరలించపోవటం సరి కాదన్నారు. ఇది సీమ ప్రజల ఆకాంక్షలపై పిడుగుపాటు లాంటిదన్నారు. అభివృద్ధి అంటే ఒకేచోట అది అమరావతిలోనే కేంద్రీకరించటం కాదని కూటమి ప్రభుత్వం గుర్తెరగాల న్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అహేతుకంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కృష్ణా రివర్‌బోర్డును సీమకు తరలించాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పోలవరం కంటే ముందు సీమకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇవేవి చేపట్టకుండా సీమ హక్కులను కాలరాసే ప్రయత్నాలు సముచితం కాదన్నారు. గతంలో కేంద్రం అనంతపురం జిల్లాకు కేటాయించిన సంస్థలను గుంటూరు జిల్లా మంగళగిరికి తరలించడాన్ని ఇక్కడి ప్రజానీకం ఇంకా మరిచిపోలేదన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ ప్రాంతాల మధ్య విభేదాలకు దారి తీస్తోందని తెలంగాణ అనుభవాలను మరిచిపోవద్దన్నారు. వెం టనే కర్నూలులోని ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ప్రతి పాదనలను విరమించుకోవాలని కోరుతున్నామన్నారు. సీమ ప్రజలు కూటమి ప్రభుత్వంపై వుంచిన నమ్మకాన్ని నిలుపు కోవాలన్నారు. రాయలసీమ ప్రజాప్రతినిధులు ఈ తరలింపు చర్యలపై నిరసిస్తూ ప్రజల పక్షాన గొంతువిప్పాలన్నారు. సమావేశంలో రాయలసీమ మహిళాశక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థిశక్తి కన్వీనర్ హరిత, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణలు పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు...

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు
- అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎమ్ఎస్


ప్రశాంతినగర్‌లో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడవేసిన దుస్తులు

పులివెందుల టౌన్, జూన్ 19: తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో పులివెందుల పట్టణంలో చోరీలను పరిశీలిస్తే అన్నీ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. గత కొద్ది రోజులుగా పులివెందుల పట్టణంలో వరుస చోరీలు జరుగుతున్నాయి. పట్టణంలోని ప్రశాంతినగర్‌లో అల్లాబకాష్ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న బీరువాలు పగులగొట్టి అందులో ఉన్న 28తులాల బంగారు, రూ.40వేలు నగదు చోరీకి గురైంది. గత కొద్ది రోజుల నుంచి పట్టణంలో పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరిగాయి. నేరుగా తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీలకు పాల్పడుతున్నారు. వీటిలో అత్యధిక శాతం చోరీలు జరిగిన ప్రదేశాలు పరిశీలిస్తే పట్టణం నడిబొడ్డున చోరీలు జరగడం విశేషం. దీనిని బట్టి చోరీలకు పాల్పడిన తర్వాత సులువుగా తప్పించుకొని వెళ్లేందుకు వీలుగా ముందుగా రెక్కీలు నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతోంది.

అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎమ్ఎస్

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ ఉండే విధంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎమ్ఎస్) ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ జరిగే ది. గతంలో ఈ పద్ధతి ద్వారా కొంతమేర ఫలితాలు వచ్చాయి. ఇపుడు పూర్తిగా అటకెక్కింది. రాత్రి సమయాలలో పోలీసుల గస్తీ కూడా అంతంతమాత్రంగానే ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో గస్తీలకు బ్లుకోల్ట్స్ టీంలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ టీంల జాడే కనిపించలేదు. ఈ నేప ధ్యంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతుండడంతో చోరీలు అధికమయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యా...ప్రమాదమా?

- చెన్నూరు వద్ద హైవేలో ఛిద్రమైన మృతదేహం
- సంఘటనపై అనుమానం వ్యక్తం చేస్తున్న స్థానికులు



మృతుని ఆధార్‌కార్డు

చెన్నూరు, జూన్ 19 : చెన్నూరు వద్ద జాతీయరహదారిపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఓ వ్యక్తి శరీరం ఛిద్రమై కనిపించింది. అయితే ఇతన్ని ఎవరైనా హత్య చేశారా, లేక రోడ్డు ప్రమాదమా అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మృతుడు మండలంలోని కనుపర్తి గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి (38)గా గుర్తించారు. ఇతను నిత్యం మద్యం సేవించేవాడు. చెన్నూరులో అతని సోదరి నివాసం ఉంటోంది. కాగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతుడు నారాయణరెడ్డి బాగా మద్యం తాగి ఆ ప్రాంతంలో ఉన్నాడని, అయితే తెల్లవారేసరికి శవమై కనపించాడు. అయితే గుర్తుపట్టలేని విధంగా మృతదేహం ఛిద్రమైపోయింది. దీంతో అతన్ని ఎవరైనా హత్య చేశారా లేక మద్యం మత్తులో వాహనాల కింద పడ్డారా అన్న నుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. పోలీసులు మాత్రం ఇది ప్రమాదం అయి ఉండవచ్చు అనే కోణంలో విచారిస్తున్నామని చెబుతున్నారు. కాగా, మృతదేహం దగ్గరలో ఓ సిమెంటు దిమ్మె రక్తంతో ఉండడం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. మృతున్ని సిమెంటు దిమ్మెతో తలపై మోది చంపి రోడ్డుపై వేశారా లేక చంపిన తరువాత వాహనాల కింద పడేశారా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. ఆ కోణంలో కూడా విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ అంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటనలో అనుమానితునిగా ఉన్న మృతుని బంధువును స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నట్లు తెలిసింది.

తీరు మారలేదు..

- మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో జగన్ ఫొటో
- టీడీపీ నేతల ఆగ్రహం.. కమిషనర్‌కు ఫిర్యాదు



మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఉన్న జగన్ ఫొటో, కమిషనర్‌తో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రాజంపేట, జూన్ 19: ప్రభుత్వం మారినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను రాజంపేట మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో అలాగే పెట్టడం తగదని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ ఫొటోను తొలగించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేత ఫొటో పెట్టడంలో అర్థమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా అన్నక్యాంటిన్‌ను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న అన్నా క్యాంటిన్‌లో ఇంకా సచివాలయం కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే అన్నా క్యాంటిన్‌లో ఉన్న సచివాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి క్యాంటిన్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, టీడీపీ నాయకుడు గంప శివ, కౌన్సిలర్ సుధాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, అబూబకర్, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'సికిల్ సెల్' రక్తహీనతపై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

రాయచోటి టౌన్, జూన్ 19: సికిల్ సెల్ రక్తహీనతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో బాలికలకు సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ రక్తహీనత లక్షణాలు, చికిత్స నివారణ, నియంత్రణ గురించి అవగాహన కల్పించారు. సికిల్ సెల్ వ్యాధి ఉన్న వారిలో ఎర్ర రక్తకణాలు త్వరగా నశించి రక్తహీనతకు దారి తీస్తుందన్నారు. తద్వారా అనేక రుగ్మతలకు గురవుతారని, పౌష్టికాహారంతో పాటు సమతుల ఆహారం తీసుకోవడం, వ్యాయామం ద్వారా వ్యాధి రాకుండా రక్షణ పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీస్ సూపరింటెండెంట్ సురేశ్, ప్రిన్సిపాల్ బి.లత, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాంప్రసాద్‌రెడ్డితోనే రాయచోటి అభివృద్ధి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, జూన్ 19: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తోనే రాయచోటి అభివృద్ధి సాధిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాతీర్పుతో ప్రజాపాలన మొదలైందని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుతున్నారని, తమ అభిప్రాయాలు చెప్పగలుగుతున్నారన్నారు. కౌరవ సభ స్థానంలో కొలువయ్యే గౌరవసభ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చుతుందని తెలిపారు. నాడు అశాంతితో బతికిన ప్రజల మనసులు నేడు తేలిక పడ్డాయని, మహిళలు తమ రక్షణపై, తల్లులు తమ బిడ్డల భవిష్యత్తుపై కొండంత ధైర్యంగా ఉన్నారని, రాష్ట్ర ప్రజల ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయన్నారు. 5 కోట్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజల భాగస్వామ్యంతో ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి మంచి చేయాలనే చంద్రబాబు సంకల్పం నెరవేరుతుందన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ద్వారా రాయచోటిలో మైనార్టీలు పూర్తిగా నష్టపోయారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, సంజీవరెడ్డి, అంజద్‌బాషా, రాష్ట్ర లీగల్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి యూసఫ్, మైనార్టీ సెల్ కార్యదర్శి జావీద్, వినోద్, నరసింహనాయుడు, సలీం, అబిద్, ఎజాస్, సగీర్, మైనుద్దీన్, అమీర్‌బాషా, ఖాదర్‌మొహిద్దీన్, మాసాపేట బాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

పెనగలూరు, జూన్ 19: మండల కేంద్రమైన పెనగలూరులో జరుగుతున్న వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దేవాలయ ప్రాంగణంలోని ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వెండి ఊయలలో కొలువుదీర్చిన రుక్మిని సత్యభామ సమేత వేణుగోపాలుడి ఉత్సవమూర్తులకు భక్తులు ఘనంగా ఊంజల్ సేవ నిర్వహించారు. చుండు శంకరయ్య కుటుంబ సభ్యులు విరాళం ఇచ్చిన వెండి ఊయలలో ఆశీనులను చేసి భక్తి గీతాలను ఆలపించారు. ధర్మకర్త జిలకర సుబ్బయ్య ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైసీపీ నాయకుని నిర్వాకం

● వాటర్‌ప్లాంట్‌కు రూ.4 లక్షల బకాయి

● నిద్రావస్థలో ట్రాన్స్‌కో అధికారులు



కొత్తపేటలో ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా నిర్మించిన వాటర్‌ప్లాంట్

పుల్లంపేట, జూన్ 19: పేదవాడు ఏదైనా ఇబ్బంది ఎదురై ఒక నెల కరెంటు బిల్లు కట్టకపోతే విద్యుత్ అధికారులు వెంటనే కనెక్షన్ కట్ చేస్తారు. నెత్తినోరు మొత్తుకొన్నా మా రూల్స్ మావే బిల్లు కడితేనే కనెక్షన్ ఇస్తామంటారు. కానీ ఓ వైసీపీ నాయకుడు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌కు ఏకంగా రూ.4 లక్షలు బిల్లు కట్టాల్సి ఉన్నా ఏ మాత్రం పట్టీ పట్టనట్లు ఉన్నారు. గత ప్రభుత్వం అండదండలతో నీటి వ్యాపారం చేసుకొంటూ నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు సంపాదించినా 5 సంవత్సరాల పాటు కరెంట్ బిల్లు కట్టకుండా ఉండడంతో బకాయి పేరుకుపోయి రూ.4 లక్షల రూపాయలకు చేరింది.

మండలంలోని కొత్తపేట పంచాయతీలో 2014 సంవత్సరంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మినరల్ వాటర్‌ప్లాంట్ మంజూరైంది. ప్లాంట్‌కు కావాల్సిన మెటీరియల్ అంతా ఈ పథకం కింద ఇచ్చారు. అప్పటి సర్పంచ్‌గా ఉన్న చిన్నం వెంకటలక్ష్మీ ప్రభుత్వ పాఠశాల స్థలంలో ఓ గదిని నిర్మించి, కొత్తగా బోరు వేసి, విద్యుత్ కనెక్షన్ తీసుకొన్నారు. ఇందుకు రూ.4 లక్షల వరకు ఖర్చు చేసింది. ప్రతినెలా కరెంట్ బిల్లు చెల్లిస్తూ వచ్చారు. ఆ తర్వాత 2019 లో ప్రభుత్వం మారడంతో గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఇది ప్రభుత్వ స్థలంలో ఉంది.. తమ ప్రభుత్వం వచ్చినందున తమకే ఇవ్వాలని పట్టుబట్టి వాటర్‌ప్లాంట్‌ను స్వాధీనం చేసుకొన్నారు. అప్పటి వరకు కరెంట్ బిల్ పెండింగ్‌లో లేదు. అధికారులు కూడా వైసీపీ నాయకునికి వత్తాసు పలికి అతనికి స్వాధీనం చేశారు. దీంతో ఆ వైసీపీ నాయకుడు ట్యాంకర్లకు నీళ్లు పట్టి ట్యాంకరుకు రూ.200 చొప్పున 15 ట్యాంకర్లు అమ్ముతూ వచ్చాడు. అంతేకాకుండా పంచాయతీ ప్రజలు కూడా డబ్బులు ఇచ్చి మినరల్ వాటర్ తీసుకెళ్లడంతో 5 ఏళ్లు వ్యాపారం చేసినా కరెంటు బిల్లు మాత్రం చెల్లించలేదు. విద్యుత్ అధికారులు అడిగినప్పుడు వైసీపీ నాయకులు ఉన్నతాధికారులతో ఫోన్ చేయించి బిల్లు చెల్లించకుండా సర్దిచెప్పి పంపేవాడు. ఇలా 5 సంవత్సరాలు గడిచేసరికి రూ.4 లక్షల మేరకు బకాయి ఏర్పడింది. ఇప్పుడు తిరిగి ప్రభుత్వం మారడంతో విద్యుత్ బిల్ బకాయిలు వెలుగు చూశాయి.

దీనిపై ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ అడగగా ఆర్‌డబ్ల్యుఎస్ కింద ఉండడంతో పంచాయతీ వారు చెల్లిస్తారని, అందువల్ల తమ ద్యూలిస్టులో లేదని సమాధానం చెప్పారు. పంచాయతీ కార్యదర్శి గిరి మాట్లాడుతూ.. ప్లాంటుకు సంబంధించి కరెంటు బిల్లు కట్టాలని ట్రాన్స్‌కో అధికారులు ఎవరూ తమకు చెప్పలేదని, వాటర్ ప్లాంట్‌కు, పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదని తెలియజేశారు.

ఎంఆర్‌సీ ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, జూన్ 19: మండల కేంద్రమైన సిద్దవటం ఎంఆర్‌సీ కార్యాలయాన్ని బుధవారం డీఈఓ అనురాధ ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు, హాజరు పట్టిక పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రతిఒక్కరూ సరైన సమయానికి పాఠశాలకు రావాలని, విద్యార్థులకు అందించే మెనూ పరిశీలించాలని, ఎక్కడా నాణ్యత లోపం ఉంటే వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని అరుణ, ఎంఆర్‌సీ సిబ్బంది గౌతమి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

● సీపీఐ డిమాండ్

రైల్వేకోడూరు(రూరల్), జూన్ 19: పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం పగలగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో కొంతమంది దుండగులు శిలాఫలకం పగలగొట్టడం దురదృష్టకరమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల జీవనోపాధుల పెంపుపై ప్రత్యేక దృష్టి : ఏపీఎం

వీరబల్లి, జూన్ 19: సభ్యుల జీవనోపాధుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెడతామని వెలుగు మండల సహాయ ప్రాజెక్టు మేనేజర్ ఖాదర్‌వలి అన్నారు. బుధవారం తాటిగుంట్లపల్లె గ్రామ సమాఖ్య-1 మహాజన సమావేశంలో మాట్లాడారు. స్వయం సహాయక సంఘ సభ్యుల్లో వారికి ఇష్టమైన జీవనపాధిని గుర్తించి ఆదాయం పెరిగేలా చూస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. తాటిగుంట్లపల్లె గ్రామ సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా భారతి, కార్యదర్శిగా జయమని, కోశాధికారిగా నయిమున్నీషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు సరస్వతి, సీసీ కృష్ణయ్య, వీవోఏ కత్తి బాబు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో పర్వతవర్దినిదేవి

పుల్లంపేట, జూన్ 19: పుల్లంపేట స్థానిక శివాలయంలో పర్వతవర్ధినిదేవి శాంతిలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పర్వతవర్ధిని దేవిని బుధవారం తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు బుధవారం నెమలి వాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో అఖండ భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

రాయచోటిటౌన్, జూన్ 19: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లాబకాష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్‌రఫీక్, డీసీసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్‌అలీ, డీసీసీ జనరల్ సెక్రటరీ మహమ్మద్‌అలీఖాన్, డీసీసీ సెక్రటరీ బషీర్‌బేగ్, షేక్.మహమ్మద్‌అలీ, షబ్బీర్, జబీవుల్లా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

● నేడు జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు : ఎస్‌ఎఫ్‌ఐ

రాజంపేట, జూన్ 19: దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష మరలా నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నీట్‌పరీక్షల్లో అవకతవకలపై జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నీట్ రాసిన విద్యార్థి కుటుంబాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలు జయప్రదం చేయడం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు మేధావులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రాధా వెంకట్ పాల్గొన్నారు.

గోవధ నిషేధాన్ని పటిష్టంగా అమలుచేయాలి

● ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ సభ్యుల డిమాండ్

పెనగలూరు, జూన్ 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు మాట్లాడుతూ గోవధ నిషేధాన్ని అధికారులు తేలిగ్గా తీసుకోవడం పట్ల ఇప్పటికి ఇంకా గోవధ కార్యక్రమాలు నిరాటంకంగా జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కడప నారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు వేటూరి శివశంకర్‌రెడ్డి, సభ్యులు నరసింహ, ముదిరాజ్ బి.గంగయ్య, పి.రమణయ్య, నారాయణ, బజరంగదళ్ గంజికుంట గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వాడకంపై కేసులు నమోదు

ఒంటిమిట్ట, జూన్ 19: మండల పరిధిలోని అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై బుధవారం విద్యుత్ విజిలెన్స్ ఎస్‌ఈ శ్రీనివాసబాబు, ఈఈ రమేష్ బాబు ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధిక లోడుతో విద్యుత్ వినియోగిస్తున్న 30 మందిపై, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఆరుగురు వినియోగదారులపై కేసు నమోదు చేసి రూ.2 లక్షల జరిమానా విధించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

మండలంలో విద్యుత్ దాడులు

నందలూరు, జూన్ 19: మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతిలోని అరవపల్లె, నాగిరెడ్డిపల్లె, నందలూరు గ్రామ పంచాయతీల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. విద్యుత్ చౌర్యం, అడిషనల్ లోడ్, మాల్ ప్రాక్టీస్‌లను పరిశీలించారు. 30 అధిక లోడు, 6 ఫిల్లరైజ్, 3 డీటీ, 6 మాల్ ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారు. మొత్తం కేసులకు సంబంధించి రూ.2 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీపీ ఎస్‌ఈ శ్రీనివాస బాబు, డీఈ రమేష్, డీఈఈ మధులత, ఏఈ రవిశంకర్, ఒంటిమిట్ట డీఈ మురళీధర్‌రెడ్డి, స్థానిక ఏఈ బాలసుబ్రమణ్యం, లైన్‌మెన్ శ్రీరామ్‌కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రక్తహీనత దినోత్సవం

ఓబులవారిపల్లె, జూన్ 19: మండల పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో అంతర్జాతీయ రక్తహీనత దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దీప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం సమావేశం ఏర్పాటు చేసి గర్భవతులు, బాలింతలతో మాట్లాడుతూ సకాలంలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం ద్వారా అందించే అటుకులు, బెల్లం, శనగ ఉండలు, కోడిగుడ్లు తదితర పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఎదుగుదల బాగా అవుతుందని ఆమె తెలిపారు. ప్రధాన వీధుల్లో ర్యాలీగా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతులతో కూడిన విద్యే లక్ష్యం: ఎంఈవో



విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఈవో

సంబేపల్లె, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యనందించడమే ప్రభుత్వ పాఠశాల లక్ష్యమని ఎంఈవో రమాదేవి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రాగి జావా, రుచికరమైన భోజన సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రభుత్వ బడుల్లో చేరేలా వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగు, యూనిఫామ్, టై, బెల్ట్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆరు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క పిల్లవాడు పాఠశాలలో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరనాయక్, ఉపాధ్యాయులు కొత్తపల్లి జయమ్మ, రెడ్డెయ్యరాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమాలపై తక్షణమే విచారించాలి

● ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్

రాయచోటిటౌన్, జూన్ 19: నీట్ ఫలితాల్లో జరిగిన అక్రమాలపై తక్షణమే విచారణ చేపట్టాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా అధ్యక్షుడు నగిరిమడుగు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఏ జాతీయ కమిటీ పిలుపు మేరకు బుధవారం ఏఐఎస్‌ఏ జిల్లా నేతలు పట్టణంలోని జాతీయ రహదారిలో గల అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత సమయాని కంటే ముందే ఫలితాలు ప్రకటించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ రాయచోటి పట్టణ నాయకులు సన్నీకుమార్, వెంకటరమణ, అరవింద్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను దళితులకు ఇవ్వాలి : సీపీఐ



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్), జూన్ 19: మండలంలోని అనంతరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణరాజుపోడు గ్రామం అరుంధతివాడ పక్కన ఉన్న 150 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములను దళితులకు ఇవ్వాలని సీపీఐ నాయకులు బుధవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు మొగిలి వినయ్, ఉపాధ్యక్షుడు చెన్నూరు సత్య, మండల కార్యవర్గ సభ్యులు నరసయ్య, బుజ్జమ్మ, సోనీ, కల్పన, చలపతి, పెంచలయ్య, వెంకటరమణ, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీలో అక్రమాలు'



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ప్రజలు

చిట్వేలి, జూన్ 19: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు అక్రమాలకు కల్పతరువులా మారినట్లు పంచాయతీ ఉపసర్పంచ్ బాలురెడ్డయ్య, యువ నాయకుడు కాకర్ల నాగర్జునలు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం సి.కందులవారిపల్లె పంచాయతీ ఉపాధి పనులను గ్రామస్తులతో కలిసి వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉపాధిహామీలో ఇద్దరు సిబ్బంది అటవీశాఖ పరిధిలో బౌండరీలు దాటి ప్రతిరోజు ట్రాక్టరులో కూలీలను తరలించి అడవిలో ఎటువంటి ఉపయోగంలేని గుంతలు తీస్తున్నారన్నారు. తప్పుడు కొలతలు ఇచ్చి రూ.లక్షలు అవినీతికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన వారిని విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

101 టెంకాయల సమర్పణ

గాలివీడు, జూన్ 19: మండలంలోని పూలుకుంట గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు బుధవారం 101 టెంకాయలు సమర్పించారు. సీఎంగా చంద్రబాబు, మంత్రిగా రాంప్రసాద్‌రెడ్డిలు ప్రమాణస్వీకారం చేసినందుకు గానూ పూలుకుంట, బోరెడ్డిగారిపల్లెలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, మాజీ ఎంపీటీసీ అంజనమ్మ, మహిళా నాయకురాలు సులోచనమ్మ, యువగళం సభ్యులు సాయిప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామాంజులరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గోపాలయ్య, మురార్జి, శివశంకర్, పాల్గొన్నారు.

అలవెన్స్ డబ్బు ఇవ్వాలంటూ ఫిర్యాదు

రాజంపేటటౌన్, జూన్ 19: సార్వత్రిక ఎన్నికల్లో నిర్వహించిన విధులకు సంబంధించిన అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ రాజంపేట ఆర్డీఓ, తహశిల్దారు పరిధిలోని రెవెన్యూ సిబ్బందికి మాత్రం ఎన్నికల విధులు బత్యాలు ఇచ్చారని, మిగిలిన పంచాయతీరాజ్, ఇతరశాఖల సిబ్బందికి ఇవ్వలేదని పేర్కొన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి ఎన్నికల విధులు నిర్వహిస్తే ఇంతవరకు ఇవ్వకపోవడంలో అర్థమేమిటని వారు ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రిని కలిసిన విజయసాగర్

నందలూరు, జూన్ 19: ఆంధ్రప్రదేశ్ రవాణాశాఖ మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం రాజంపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్ కలిశారు. ఈ మేరకు విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు సమస్యలను మంత్రితో చర్చించినట్లు తెలిపారు.

భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రామాపురం, జూన్ 19: మండల కేంద్రమైన రామాపురంలో మహాభారత యజ్ఞ కమిటీ నిర్వాహకుడు రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అరణ్యపర్వం, రాత్రి అరుణపర్వం డ్రామా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిట్లూరు గ్రామం చెరువుముందరపల్లెకు చెందిన గాలివీటి లక్ష్మిరెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరై అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాభారతం సందర్భంగా మండలంలోని చుట్టుపక్కల ప్రజల మహిళలు, మహాభారత యజ్ఞ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

గాయపడిన వ్యక్తికి పరామర్శ

మండలంలోని చిట్లూరు గ్రామం ముసల్‌రెడ్డిగారిపల్లె నివాసి గాలివీటి సురేందర్‌రెడ్డి అరుణాచలం వెళ్తూ మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదం జరిగి గాయపడ్డాడు. ఆ విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంబరాల్లో జనసేన నేతలు

పుల్లంపేట, జూన్ 19: జనసేనపార్టీ అధినేత కొణిదెల పవన్‌కళ్యాణ్ బుధవారం ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో పుల్లంపేటలోని జనసేనపార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కొండేటి జగ్గయ్య, పసుపులేటి సుబ్బయ్య, బీజేపీ నాయకులు కంపాల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు చెంగల్‌రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు మతిభ్రమించింది: బీజేపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

రాజంపేట, జూన్ 19: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఏకంగా 164 సీట్లు లభించడంతో వైసీపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాజంపేట బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల పార్లమెంట్ ఇన్‌ఛార్జి పోతుగుంట రమేష్‌నాయుడు, బీజేపీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, రమణ తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల ఫలితాలు వెలువడినప్పుడు లేని ఈవీఎంల ట్యాంపరింగ్, ఇప్పుడు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. అసలు ఎలక్షన్ కమిషన్‌పై అనవసరంగా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య మనుగడకే చెడ్డపేరన్నారు. జగన్ ఎన్ని ఆరోపణలు చేసినా ఎవరూ నమ్మరని, ఈ ఎన్నికల్లో అతన్ని ప్రతి ఒక్కరూ చీదరించుకుని దారుణంగా ఇంటికి పంపారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నగేష్, నవీన్, రమణాచారి, ప్రవీణ్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చెర నుంచి క్వారీకి విముక్తి

● ఎట్టకేలకు స్వాధీనం చేసుకున్న జనార్దన నాయుడు





మాదిగబండ సమీపంలోని క్వారీ - క్వారీలో నాలుగేళ్లుగా బండరాళ్లు తీసేయడంతో ఏర్పడిన గుంత

పలమనేరు, జూన్ 19: పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ చెరనుంచి క్వారీకి విముక్తి లభించింది. మాదిగబండ గ్రామసమీపంలోని తన క్వారీని జనార్దన నాయుడు స్వాధీనం చేసుకొన్నారు. వివరాలిలా ఉన్నాయి. శాంతిపురం మండలానికి చెందిన జనార్దన నాయుడు పలమనేరు మండలం మాదిగబండ వద్ద చిన్న క్వారీని కొన్నారు. దీని కోసం ప్రత్యేకంగా హెచ్‌లైన్ విద్యుత్ సరఫరా తీసుకున్నారు. క్వారీని కూడా విస్తరింపజేశారు. ఈ క్వారీలో వివిధ సైజుల్లో కంకరను తయారు చేసి రోడ్ల పనులకు, ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేస్తుండేవారు. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. పలమనేరు ఎమ్మెల్యేగా వెంకటేగౌడ గెలుపొందారు. ఈ క్రమంలో ఆయన జనార్దన నాయుడి నుంచి క్వారీని లీజుకని తీసుకొన్నారు. తనకు లీజు సొమ్ము చెల్లించక పోవడంతో పాటు, తాను నెలసరి వాయిదాలతో కొన్న వాహనాలనూ వినియోగించుకొంటూ వాటికి ఈఎంఐలూ చెల్లించలేదని బాధితుడు చాలాసార్లు వాపోయారు. కాగా, తనకు చెల్లని చెక్కు ఇచ్చారంటూ కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ కోర్టులో చెక్ బౌన్సు కేసు వేశారు. తనకు ఇవ్వాల్సిన లీజు డబ్బులు ఇప్పించాలని ఆయన వైసీపీ నేతల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. తన క్వారీని వాడుకోవడంతో పాటు క్వారీకి సంబంధించిన విద్యుత్ ఛార్జీలు కూడా చెల్లించక పోవడంతో లక్షలాది రూపాయలు విద్యుత్ ఛార్జీలు పేరుకు పోయాయని, హెచ్‌టీ విద్యుత్ సరఫరా తీసుకొన్న తాను ఈ మొత్తాలను చెల్లించాల్సి వుంటుందని కావున తనకు న్యాయం చేయాలని కూడా రాష్ట్ర హైకోర్టులోనూ జనార్దన నాయుడు పిటిషన్ వేశారు. ఇంత తతంగం జరిగినా వెంకటేగౌడ తన క్వారీని విడిచి పెట్టలేదని బాధితుడు పేర్కొన్నారు. తన క్వారీ నుంచి రూ.వంద కోట్లకుపైగా జల్లి కొట్టి వివిధ సంస్థలకు, సొంత కాంట్రాక్టు పనులకు, జాతీయ రహదారి పనులకు తరలించి విక్రయించుకొన్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇన్నాళ్లుగా ఆయన ఆవేదనను అధికారులూ పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వారం కిందట తన క్వారీని జనార్దననాయుడు స్వాధీనం చేసుకొన్నారు. కాగా, విద్యుత్ బకాయిలు రూ.2లక్షలు మినహా మిగిలి మొత్తాన్ని ఇటీవల వెంకటేగౌడ క్లియర్ చేశారని జనార్ద నాయుడితో పాటు విద్యుత్ అధికారులు తెలిపారు. మొత్తమ్మీద వెంకటేగౌడ చెర నుంచి క్వారీ సొంతదారు చేతికి వెళ్లింది.

ఫుడ్ పాయిజన్‌తో పలువురికి అస్వస్థత





పాలసముద్రం, జూన్ 19: ఫుడ్ పాయిజన్ కారణంగా పాలసముద్రానికి చెందిన వంద మందికిపైగా ఆస్పత్రి పాలయ్యారు. గ్రామస్థులు, వైద్యాధికారుల వివరాల మేరకు.. మంగళవారం గ్రామంలో గంగజాతర జరిగింది. అమ్మవారికి గ్రామస్థులు అంబలి సమర్పించారు. దాన్ని ప్రసాదంగా స్వీకరించారు. అదే సమయంలో అన్నదానంలో మాంసాహారం భుజించారు. బుధవారం ఉదయం నుంచి చాలామందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మధ్యాహ్నానికి వందమందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. అంగన్‌వాడీ టీచర్ విజయకు అధికంగా విరేచనాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తహసీల్దార్ సుబ్బలక్ష్మి, డి.టి మధుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్ గ్రామానికి చేరుకుని తాగునీటి నమూనాలను పరీక్షలకు పంపించారు. జాతరలో భుజించిన ఆహారం పాయిజన్ కావడం వల్లే ఇలా జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కాగా, తహసీల్దార్ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

రెఫరల్ ఆస్పత్రిగా మార్చేశారు

అపోలో స్థాయిలో అందని వైద్యం ● చిత్తూరు ఆస్పత్రి నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయంటూ గురజాల ఆగ్రహం

● నెలరోజుల్లో సరిచేయాలంటూ ఆదేశం



క్యాజువాలిటీలో రోగితో మాట్లాడుతున్న గురజాల

చిత్తూరు రూరల్, జూన్ 19: చిత్తూరు ప్రభుత్వాస్పత్రి (అపోలో).. రెఫరల్ ఆస్పత్రిగా మారిందని రోగుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం ఆయన ఆకస్మికంగా ఆస్పత్రిని తనిఖీ చేశారు. చిన్న చిన్న రోగాలకు కూడా తిరుపతి, సీఎంసీ ఆస్పత్రులకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగైతే జిల్లా ఆస్పత్రి ఎందుకని ప్రశ్నించారు. డబ్బుల్లేక ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేదలకు.. మందులను బయటకు రాసిస్తే ఎలా కొనగలరని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. క్యాజువాలిటీలో పీజీ విద్యార్థులతో అత్యవసర వైద్యం ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. వారే నేర్చుకోవడానికి వస్తే వారి చేత పేదల ప్రాణాలు పెడుతున్నారా? అని ఆగ్రహించారు. ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే భోజనం తింటే వాంతులు వస్తున్నాయని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆ భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. రసానికి సాంబారుకు ఏం తేడా లేదని, అన్నం బాగాలేదని ఆగ్రహించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేసిన ఆయన రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా జరుగుతున్నాయని అడిగారు. చాలా వరకు మందులు, మాత్రలు బయట తీసుకుంటున్నామని చెప్పారు. బాత్ రూముల్లో నీళ్ల సక్రమంగా రావడం లేదని కొందరు ఫిర్యాదు చేశారు. చాలా వరకు రక్త పరీక్షలు, స్కానింగ్‌కూ ప్రైవేటుకు రాసిస్తున్నారని చెప్పారు.

నెలలో మార్పు కనిపించాలి

తాను నెల తర్వాత మళ్లీ వస్తానని, అప్పటికి మార్పు లేకుంటే నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని యాజమాన్యాన్ని గురజాల హెచ్చరించారు. పేదలకు మెరుగైన వైద్యం అందుతుందనే ప్రభుత్వాస్పత్రిని అపోలోకు ఇచ్చారని గుర్తుచేశారు. ఇకపై మొత్తం మారాలని, లేకుంటే తాను మారుస్తానని తెలిపారు. ఆయన వెంట నగరపాలక కమిషనరు అరుణ, అపోలో హెడ్ నరేష్‌కుమార్ రెడ్డి, ఆర్‌ఎంవో సంధ్య తదితరులు ఉన్నారు.

అన్నప్రసాదంలో నాణ్యత పెంచండి



టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. టీటీడీ అన్నప్రసాద విభాగ కార్యకలాపాలను బుధవారం ఆయన సమీక్షించారు. గోకులం విశ్రాంతి భవనంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, అధికారులతో కలిసి అన్నప్రసాద విభాగంపై ఈవో సుదీర్ఘంగా సమీక్షించారు. తిరుమలలో వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని అక్షయ కిచెన్, పీఏసీ2తో పాటు ఉద్యోగుల క్యాంటీన్, పద్మావతి అతిథిగృహం సహా తిరుమలలోని అన్నప్రసాదాలు తయారు చేసే ప్రదేశాలపై ఈవో సమీక్షించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి పాంచజన్యం వంటశాలలను త్వరగా ప్రారంభించేలా చూడాలన్నారు. సగటున రోజుకు 1.75 లక్షల మంది అన్నప్రసాదాలు స్వీకరిస్తుండగా, తిరుపతిలో 17 వేలు, వారాంతాల్లో తిరుమలలో 1.95 లక్షలు, తిరుపతిలో 19 వేల మంది స్వీకరిస్తున్నట్టు అధికారులు వివరించారు. మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే ఆవరణను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని ఈవో సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.రద్దీకి అనుగుణంగా సిబ్బందిని పెంచడంతో పాటు డిమాండ్‌కు దీటుగా దశాబ్దాల నాటి యంత్రాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అన్నప్రసాదం నాణ్యతను పెంచేందుకు ఫుడ్ కన్సల్టెంట్‌ను నియమించడం వంటి అంశాల అమలుపై పక్కా ప్రణాళికతో ముందుకు రావాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ జీఎల్ఎన్ శాస్త్రి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ల కొనసాగింపు : ఎస్పీ



జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 19: జిల్లాలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్‌పై గట్టి నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం సబ్ డివిజన్ అధికారులతో ఆయన నేర సమీక్షా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లను కొనసాగించాలన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాన్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు పాల్గొన్నారు. పోలీసు అతిథి గృహంలో సెంట్రల్ క్రైం పోలీసులతో కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. పదే, పదే నేరాలు చేస్తున్న వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీసు గ్రౌండులో డీఎస్పీ రమణకుమార్‌తో పాటు అదనపు ఎస్పీలతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. త్రిబుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనంగా 20 మంది హోం గార్డులను నియమిస్తున్నట్లు చెప్పారు.

పుంగనూరులో కిలో టమోటా ధర రూ.66.70

పుంగనూరు, జూన్ 19: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రైతులు విక్రయాలకు తీసుకువచ్చిన టమోటా ధరకు రెక్కలొచ్చాయి. మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.66.70 పలికింది. గతకొద్దిరోజులుగా వేసవి ఎండతో పంట దిగుబడి తగ్గడం వల్ల టమోటా ధరలు రోజూ రోజూకు పెరుగుతున్నాయి. మంగళవారం కిలో రూ. 60లకు కాగా బుధవారం రూ.66.70కు పెరిగింది. నాణ్యతను బట్టి రెండో రకం కిలో రూ. 62.70లు, మూడవ రకం కిలో రూ. 56.70 చొప్పున 291.82 మెట్రిక్ టన్నులు రైతుల నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేసి డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

పల్ప్ రకం కాయలను గుజ్జుపరిశ్రమలకే తరలించాలి



మార్కెట్ యార్డును సందర్శించిన సాగరిక

బంగారుపాళ్యం, జూన్ 19: మామిడి రైతులు పల్ప్ రకమైన తోతాపురిని గుజ్జు పరిశ్రమలకు నేరుగా తరలిస్తే టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అదనంగా పొందవచ్చని ఉద్యానశాఖ అధికారిణి సాగరిక అన్నారు. బుధవారం ఆమె స్థానిక మార్కెట్ యార్డును సందర్శించి, అక్కడి రైతులతో మాట్లాడుతూ పక్వానికి వచ్చిన తర్వాతనే మామిడికాయలను కోయాలన్నారు. అలా కోసిన వాటిని నేరుగా గుజ్జు పరిశ్రమలకు తరలించాలని సూచించారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూన్ 19: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,52,94,363 లభించినట్లు ఈవో వెంకటేశు వెల్లడించారు. ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం హుండీ కానుకలను ఈవో పర్యవేక్షణలో లెక్కించారు. 80 గ్రాముల బంగారు, 3.150 కిలోల వెండి, 904 యూఎస్‌ఏ, 50 ఆస్ట్రేలియా, 25 సింగపూర్ డాలర్లు, 2 మలేషియా రింగిట్స్ లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.10,376, నిత్యాన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.27,217 సమకూరాయి. 20 రోజులలో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, మల్లికార్జున పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

● టీచరు సహా పలువురిపై కేసు

వెదురుకుప్పం, జూన్ 19: భార్యాభర్తలపై మారణాయుధాలతో దాడి చేసి, గాయపరిచిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితురాలు శశికళ తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ పంచాయతీ దిగువ గెరిగిదొనకు చెందిన పి.రాజశేఖర్, శశికళ దంపతులపై ఆదివారం రాత్రి అదే పంచాయతీలోని ఎగువ గెరిగిదొనకు చెందిన ఆర్.హరికృష్ణ(టీచర్), అతని అనుచరులు పి.రాజేష్, సాయి, పుష్ప, వాసు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాజశేఖర్ దంపతులకు గాయాలయ్యాయి. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులు సెక్షన్ 324, రెడ్ విత్ 34 ఐపీసీల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాతకక్షలతో దాడి

వెదురుకుప్పం: పాతకక్షల నేపథ్యంలో 16వ తేదీన తన భార్యాబిడ్డలపై కొందరు దాడి చేశారని ఎగువ గెరిగిదొనకు చెందిన పి.దేవరాజులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరికృష్ణతో దేవరాజులు భార్య ఆదిలక్ష్మికి పొలం వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. గ్రామ పెద్దల జోక్యంతో సర్దుబాటైంది. దాన్ని మనసులో పెట్టుకున్న హరికృష్ణ, దిగువ గెరిగిదొనకు చెందిన అతని బంధువులు వాసు, పుష్ప, సాయి, రాజేష్ కలిసి ఆదిలక్ష్మి, ఆమె పిల్లలపై దాడి చేశారు. ఆదిలక్ష్మి గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతోంది. దీనిపై హరికృష్ణ సహా అనుచరులపై 324, 34ఐపీసీ సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించండి

చిత్తూరు సిటీ, జూన్ 19: మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గిందన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తోతాపురి రకానికి టన్నుకు రూ.30 వేలు తగ్గకుండా రైతులకు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ జిల్లాలోని గుజ్జు పరిశ్రమల యజమానులకు ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. యాజమాన్యాలు సహకరించి, అన్నదాతకు అండగా నిలవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

తెప్పలపై సిరులతల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, జూన్ 19 : తెప్పోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మహాలక్ష్మి అలంకరణలో తిరుచానూరు పద్మావతీ దేవి తెప్పలపై విహరించి భక్తులకు అభయ ప్రదానం చేశారు.మధ్యాహ్నం ఉత్సవమూర్తికి పద్మసరోవరంలోని నీరాడమండపంలో అభిషేకం జరిగింది.శుక్రవారం జరిగే గరుడవాహనసేవతో అమ్మవారి తెప్పోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. డిప్యూటీ ఈవో గోవిందరాజన్,ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే నాని



మామండూరు వద్ద జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదం వద్ద ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూన్ 19: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించబోయి ఎమ్మెల్యే పులివర్తి నాని మానవత్వం చాటుకున్నారు. చంద్రగిరి మండలం మామండూరు వద్ద బుధవారం టమోటాలను తీసుకెళ్తున్న వ్యాన్ టైర్ పంక్చరై బోల్తా పడింది.డ్రైవర్ వాహనంలో ఇరుక్కుపోయాడు. అదే సమయంలో పాకాల నుంచి వస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని వాహనాన్ని ఆపారు. వ్యాన్ డ్రైవర్‌ను సిబ్బంది చేత బయటకు తీయించారు. తన వాహనంలోనే ఆస్పత్రికి తరలించాలని సిబ్బందికి సూచించారు. అయితే ఆలోపు హైవే అంబులెన్స్ రావడంతో క్షతగాత్రుడు రజనీని చంద్రగిరి ఆస్పత్రికి తరలించారు.

తిరుపతిలో ఎంతో నేర్చుకున్నా

● బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్

● గనుల శాఖ కమిషనర్‌గా ప్రమోషన్

● ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర



ప్రవీణ్‌కుమార్ - ధ్యానచంద్ర

తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ బదిలీ అయ్యారు. తదుపరి కలెక్టర్ నియమితులయ్యే వరకూ జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఇంచార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ప్రవీణ్ కుమార్ ప్రాధాన్యత కలిగిన మైన్స్ అండ్ జియాలజీ శాఖకు కమిషనర్ మరియు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టులోనూ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.గత ఏప్రిల్‌లో ఎన్నికల షెడ్యూలు కూడా విడుదలయ్యాక అప్పటి కలెక్టర్ లక్ష్మీశ పనితీరు పట్ల అసంతృప్తితో ఎన్నికల కమిషన్ ఆయనపై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో జిల్లా కలెక్టర్ పోస్టు కోసం సీఎస్ ప్రతిపాదించిన ముగ్గురు అధికారుల్లో ఈసీ ప్రవీణ్ కుమార్ నియామకాన్ని ఆమోదించింది. దీంతో గత ఏప్రిల్ 4న కలెక్టర్‌గా, జిల్లా ఎన్నికల అధికారిగా బాధ్యతలు తీసుకున్న ప్రవీణ్ కుమార్ ఎన్నికల నిర్వహణలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినా, మరుసటి రోజు స్ట్రాంగ్ రూములున్న పద్మావతీ వర్సిటీ ఆవరణలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థిపై భయానక దాడి జరిగినా... కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనితీరు పట్ల ప్రతిపక్షాల నుంచీ ఎలాంటి ఫిర్యాదులూ, ఆరోపణలు, విమర్శలు రాలేదు. నిష్పాక్షికంగా పనిచేశారన్న అభిప్రాయం ప్రభుత్వ పెద్దల్లో వుండడంతోనే తాజా బదిలీల్లో ఆయనకు కీలకమైన మైన్స్ అండ్ జియాలజీ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ పోస్టు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలకరించగా శ్రీవారు కొలువైన తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. అత్యంత క్లిష్టమైన ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చానని, అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా సహకారంతో సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించగలిగానన్నారు. గతంలో కీలకమైన వైజాగ్ సహా మూడు జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేసినా తిరుపతిలో ప్రోటోకాల్ విధులు సహా ఎంతో నేర్చుకున్నా అన్నారు. ఈ జిల్లాలో ప్రతి ఐఏఎస్ అధికారీ నేర్చుకోవాల్సింది ఎంతో వుందని భావిస్తున్నానన్నారు. పనిచేసింది రెండున్నర నెలల స్వల్ప సమయమే అయినా కల్మషం లేకుండా ప్రశాంతంగా వుండే ఇక్కడి ప్రజలు అందించిన సహకారం మరవలేనంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేను బడికి పోతా.. పురోగతి ఏదీ?

అధికారుల ఉదాసీనత ● ఆరు రోజుల్లో బడిలో చేర్చింది ఒకరినే

చిత్తూరు (సెంట్రల్), జూన్ 19: బడిబయటి పిల్లల్ని బడిలో చేర్పించడంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంపై సమగ్రశిక్ష అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 13 నుంచి జూలై 12 వరకు కార్యక్రమం నిర్దేశించారు. కాగా 13 నుంచి 18వ తేది వరకు ఆరు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విద్యాశాఖలో ప్రధానమైన సమగ్రశిక్ష ద్వారా ఈ కార్యక్రమం జరగాల్సి ఉంది. విద్యాశాఖతో పాటు పంచాయతీరాజ్, కార్మికశాఖ, ఏటీడీఏ, ఏసీడీఎస్, ట్రైబల్, సోషల్, బీసీ, మైనారిటీ వెల్ఫేర్, మెప్మా, కేజీబీవీ శాఖలను సమన్వయం చేసుకుని 6-14 ఏళ్లలోపు బడిబయటి, బడిమానేసిన పిల్లల్ని బడిలో చేర్పించాల్సి ఉంది. ఈ విషయంలో సమగ్ర శిక్ష అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరు రోజుల స్పెషల్ డ్రైవ్‌లో పెనుమూరు, వెదురుకుప్పం మండలాల్లో ఒక్కొక్కరిని గుర్తించగా, వెదురుకుప్పంలోని పిల్లాడు మాత్రమే మంగళవారం బడిలో చేరాడు. ఇకనైనా అధికారులు స్పందించి జూలై 12వ తేది వరకు జరగనున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.41 కోట్లు

తిరుమల, జూన్19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం భారీగా రూ.5.41 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది.మంగళవారం 75,125 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,140 మంది తలనీలాలు సమర్పించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 19: తిరుపతి కేంద్రంగా భారత, ఆంధ్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లయిడ్ న్యూట్రీషియన్ కోర్సులకు దరఖాసులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రమణప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పాస్ లేక ఫెయిల్ అయిన విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు.కోర్సుపూర్తయ్యాక ఏపీ రాష్ట్ర పర్యాటకశాఖ హోటళ్లు, ప్రముఖ స్టార్‌హోటళ్లలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఎంపికైనవారికి హాస్టల్స్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు.ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.మరిన్ని వివరాలకు 9701343846, 9100558006, 9700440604 నంబర్లలో సంప్రదించాలని అయన కోరారు.

ధర్మారెడ్డిపై విచారణ వేగవంతం చేయండి

బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), జూన్ 19: టీటీడీ పూర్వపు ఈవో ధర్మారెడ్డిపై విచారణ వేగవంతం చేయాలని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సకలశాఖ అధిపతిగా టీటీడీలో పెత్తనం చెలాయించిన ధర్మారెడ్డి ప్రస్తుత ఈవో శ్యామలరావుకు బాధ్యతలు అపగించే సమయంలో ఫోటోలను మీడియాకు పంపవద్దని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిబంధల ప్రకారం ఆలయ మర్యాదల ప్రకారం మేల్‌చాట్ మర్యాద చేసి పంపడం ఆనవాయితీ అన్నారు. ధర్మారెడ్డి ఉద్యోగ విరమణ ఈ నెల 30 వరకు ఉన్న నేపథ్యంలో ఎవరికి తెలియకుండా ఆలయంలో మర్యాదలు చేయించుకుని అర్చకులు వేసిన మేల్‌చాట్ వస్త్రాన్ని భుజంపై వేసుకుని హుందాగా రాకుండా లారీలో సామాన్లు సర్దుకుని పలాయనం చిత్తగించడం శ్రీవారి లీల అన్నారు. మీడియా కన్ను తప్పించుకున్నా భగవంతుని కోర్టులో తప్పించుకోలేరన్నారు.

ఎన్టీఆర్ ఘాట్ పునర్నిర్మాణానికి చర్యలు



ఎన్టీఆర్‌ఘాట్ స్థలం వద్ద టీడీపీ నాయకులు

తంబళ్లపల్లె, జూన్ 19: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు గతంలో ఉన్న ఎన్టీఆర్ ఘాట్‌ను పునర్నిర్మించడానికి బుధవారం టీడీపీ నాయకులు చర్యలు ప్రారంభించారు. తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయం ఆవరణం ముందు గతంలో ఎన్టీఆర్ చిత్రంతో కూడిన పెద్ద ఇనుప ఫ్రేమ్ ఉండగా దీనిని టీడీపీ నాయకులు ఎన్టీఆర్ ఘాట్ అని పిలుచుకునేవారు. టీడీపీ కి సంబంధించిన కార్యక్రమాలన్నీ ఇక్కడే నిర్వహించేవారు. అయితే కొన్ని నెలల ముందు గత వైసీపీ నాయకులు ఎన్టీఆర్ ఫ్రేమ్‌ను తొలగించి తమ పార్టీ జెండా దిమ్మె నిర్మించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో టీడీపీ నాయకులు వైసీపీ జెండా దిమ్మెను తొలగించి గతంలో ఎన్టీఆర్ ఫ్రేమ్ ఉన్న స్థానంలోనే నూతన ఫ్రేమ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి నూతన హంగులతో తిరిగి ఎన్టీఆర్ ఘాట్‌ను ఏర్పాటుచేస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి తెలిపారు. సిద్ధమ్మ, గంగరాజు, సోమశేఖర్, కాలా నారాయణ, వీరాంజినేయులు, మదన్‌మోహన్‌రెడ్డి, మ్యూజికల్ శివ, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు పంచాయతీకి తగ్గిన ఆదాయం

● ముగిసిన మార్కెట్ సెస్సు వసూలు హక్కుల వేలం

పీలేరు, జూన్ 19: పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదాయ వనరుల నిర్వహణకు బుధవారం జరిగిన వేలం పాటలు తూతూ మంత్రంగా ముగిశాయి. అధికారులు ముందుగా వెల్లడించినట్లు ఏడాది కాల పరిమితికి కాకుండా 9 నెలల వ్యవధి కోసం వేలం పాటలు నిర్వహించడంతో ఆదాయం గణనీయంగా తగ్గింది. ఏడాది కాలపరిమితితో వేలం పాటలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం అయినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా ఇప్పటికే మూడు నెలల కాలం గడిచి పోయిందని, గడిచిన కాలానికి తాము రుసుములు చెల్లించేందుకు గుత్తేదారులు నిరాకరించడంతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీ ఇన్‌చార్జి ఈవో గఫూర్ ఉన్నతాధికారులతో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో గురువారం నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు రుసుములు వసూలు చేసుకునే హక్కులకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటల్లో జంతు వధశాల రూ.2.64 లక్షలు, ప్రైవేటు బస్టాండు రూ.3.67 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.2.36 లక్షలు పలికాయి. సిండికేట్ వ్యవహారం ఫలించకపోవడంతో గుత్తేదారులు పోటీ పడినా పంచాయతీ ఆదాయం మాత్రం ఆశించనంత స్థాయిలో పెరగలేదు. ఈ విషయమై డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన వేలాన్ని ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా నిర్వహించలేకపోయామని, వచ్చే ఏడాది నుంచి ఆదాయం పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు, పాల్గొన్న కాంట్రాక్టర్లు

కనిపించని వైసీపీ నాయకులు

ఈ వేలం పాటల్లో వైసీపీ నాయకులు కనిపించలేదు. గత ఏడాది వారపు సంతతోపాటు, దినసరి కూరగాయల మార్కెట్‌ను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి దక్కించుకుని రైతులకు ఎటువంటి రుసుము లేకుండా చేశారు. ఈ ఏడాది కూడా అటువంటి వెసులుబాటు ఉంటుందని చాలా మంది రైతులు, వ్యాపారులు భావించారు. అయితే గడిచిన ఐదేళ్లుగా వేలం జరిగినప్పుడు హడావుడి చేసిన వైసీపీ నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు బుధవారం ముఖం చాటేశారు. సిండికేటు వ్యవహారాలను సైతం తమ కనుసన్నల్లో చక్కపెట్టుకునే నాయకులు సైతం బుధవారం వేలం పాటల సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో కనిపించలేదు.

అవినీతి రహిత అభివృద్ధే నల్లారి కిశోర్ ధ్యేయం..

● మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 19: నియోజకవర్గంలో అవినీతి రహిత అభివృద్ధి సాధించడమే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్యేయమని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ సమావేశ భవనంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాజకీయపార్టీల కక్షలు నియోజకవర్గ ప్రజలపై ప్రభావం చూపకుండా, గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. పలువురు మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, ద్వారకనాథరెడ్డి, శేషాద్రి రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కోసూరి రమేష్, చంద్రమౌళి, కేవీరెడ్డి, బొక్కసం బ్రదర్స్, తోటవీధి ఫణి, సైదు, సాదిక్, మహ్మద్ హుస్సేన్, జావీద్, మస్కట్ మస్తాన్, మున్వర్, జయకృష్ణ, ఎండీ యూసుఫ్, దామోదర్‌రెడ్డి, రామాంజులురెడ్డి, మదనమోహన్‌రెడ్డి, మస్తాన్‌వల్లి తదితరులు పాల్గొన్నారు. నాగరాజు పాదయాత్ర వాల్మీకిపురం పట్టణానికి చేరుకోగా పీలేరు టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా ఘనస్వాగతం లభించింది.



మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

చంద్రబాబు అభిమాని తిరుమలకు పాదయాత్ర

మదనపల్లె టౌన్/ వాల్మీకిపురం, జూన్ 19: చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి కావడంతో మండలంలోని పోతబోలు గ్రామం జంగంపల్లెకు చెందిన నాగరాజు బుధవారం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించాడు.



పాదయాత్ర ప్రారంభిస్తున్న నాగరాజు

ఐదేళ్ల క్రితం మదనపల్లె నుంచి అమరావతికి పాదయాత్ర చేసిన నాగరాజును అప్పటి మంత్రి నారా లోకేశ్ ఇంటికి పిలిపించుకుని అభినందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడటం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో బుధవారం మండలంలోని సీటీఎం ఆంజనేయ స్వామి ఆలయంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పాదయాత్ర మొదలు పెట్టాడు. జనసేన నాయకురాలు దారం అనిత, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, అయూబ్‌బాషా, ప్రభాకర్, సురేంద్ర, గోపాల్ పాల్గొన్నారు. వాల్మీకిపురంలో టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా ఘనస్వాగతం పలికారు మాజీ ఎంపీపీ సురేంద్ర వర్మ, నాయకులు సయ్యద్‌బాషా, మస్కట్ మస్తాన్, జయకృష్ణ, జంషీద్, మున్వర్, సైదు, ఎండీ యూసుఫ్, మస్తాన్‌వల్లి, హుస్సేన్, షబ్బీర్‌అలీఖాన్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నకేశవాలయ వార్షికోత్సవాలు

మదనపల్లె అర్బన్, జూన్19: మండలంలోని భూమకవారిపల్లె సమీపంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయంలో 20వ తేదీ గురువారం నుంచి 22వ తేదీ శనివారం వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 20వ తేదీన విశ్వక్సేన ఆరాధన, పుణ్యావాచనం,రక్షాబంధనం, అకురార్పణ, కలశ స్థాపన నిర్వహిస్తామన్నారు. 21న మూల మూర్తులకు అభిషేకం, గరుడహోమం, ధ్వజారోహణ, జరుగుతుందన్నారు. 22వ తేదీ రాత్రి 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోతబోలు గ్రామస్థులే కాకుండా మదనపల్లె మండల పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు విశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా టీచర్లు పని చేయాలి

మదనపల్లె అర్బన్, జూన్ 19: విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా టీచర్లు పని చేయాలని మదనపల్లె డీవైఈవో శ్రీరాంపురుషోత్తం కోరారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని సమస్యలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల కొరత నివారించుటకు డిప్యుటేషన్ ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రచించాలని కోరారు. అనంతరం పాఠ్యపుస్తకాల నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన కిట్లును పూర్తిస్థాయిలో అందజేయాలని ఎంఈవోలను ఆదేశించారు.ఉపాధ్యాయ సంఘాలు పాఠశాలల, విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు కార్యక్రమంలో ఆర్వి రమణ, షరాఫత్ అలీఖాన్, శ్రీరామచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె టౌన్, జూన్ 19: వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి (జీటీహెచ్)లో చికిత్స పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం చింతమాను వారిపల్లెకు చెందిన రెడ్డెప్పనాయుడు కుమారుడు వెంకటేశ్వర్లు నాయుడు(20) కుటుంబ కలహాల కారణంగా బుధవారం సూపర్ వాస్మాల్ తాగాడు. కుటుంబీకులు అతడిని మదనపల్లె జీటీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మదనపల్లె పట్టణం చంద్రాకాలనీకి చెందిన నాగరాజు భార్య చంద్రకళ(33) కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబీకులు జీటీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వైభవంగా మహమ్మారెమ్మ ఊరేగింపు

మదనపల్లె అర్బన్, జూన్ 19: స్థానిక ఎస్టీఐ కాలనీలో బుధవారం మహమ్మారెమ్మ ఊరేగింపు నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఉదయం పూజలు నిర్వహించారు. గొల్లపల్లె, ఎస్టీఐ కాలనీ మహిళలు దివ్వెలు, బోనాలు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున మదనపల్లె ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా గంగమ్మపూజలో పాల్గొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు బుధవారం ఉదయం అమ్మవారికి జంతు బలులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలు, చెక్క భజనలు, బళ్ళారిడ్రమ్స్, బాణసంచా పేలుళ్ల నడుమ నిమజ్జనం చేశారు. వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన వ్యాపారులు, ఉద్యోగులు, పురప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జూదరుల అరెస్టు

ములకలచెరువు, జూన్ 19: మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ నడింపల్లె క్రాస్ సమీపంలో దాడులు నిర్వహించి ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా రూ.3200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చేయి కోసుకుని వ్యక్తి ఆత్మహత్యా యత్నం

మదనపల్లె టౌన్, జూన్ 19: కానిస్టేబుల్ తన భార్యను లొంగదీసుకుని, కాపురంలో నిప్పులు పోశాడని ఓ వ్యక్తి చేయి కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం మేరకు.. అనంతపురానికి చెందిన బాబునాయక్ (28)కు మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన మహిళతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు వుండగా, నక్కలదిన్నెలోనే అద్దె ఇంటిలో నివాసం వున్నారు. ఈ క్రమంలో మదనపల్లెకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ ఎస్ఈబీ కానిస్టేబుల్‌కు బాబునాయక్ భార్య పరిచయమైంది. వీరిద్దరు ప్రతి రోజు ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, సోషల్ మీడియాలో చాటింగ్, వీడియో కాల్స్ చేసుకునేవారు. ఈ విషయం గుర్తించిన బాబూనాయక్ భార్యను నిలదీయగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాల్సిందిగా బాబునాయక్ పలుమార్లు పిలిచినా ఆమె రాలేదు. దీంతో ఇటీవల ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించిన బాబునాయక్‌ను స్థానికులు రక్షించారు. ఈ గొడవ స్థానిక పోలీసుల దృష్టికి వెళ్లినా తనకు న్యాయం జరగకపోవడంతో, బుధవారం కత్తితో చేయి కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అతడిని మదనపల్లె సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాబునాయక్ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని వెల్లడించాడు.

బడి ఈడు పిల్లలు విధిగా పాఠశాలల్లో ఉండాలి



మండలస్థాయి అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి

పీలేరు, జూన్ 19: 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ విధిగా పాఠశాలలకు వెళ్లేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని పీలేరు ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డి అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు, బడి మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం జూన్ 13వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకు 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. మండల కమిటీలోని వివిధ శాఖల అధికారులు తమ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సదుపాయాలను పిల్లలు, వారి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అంతకు మునుపు పీలేరు ఎంఈవోలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతమ్మ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమీక్షించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో తహసీల్దారు మహబూబ్ బాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు రహత్ బాషా, అక్రమ్ బాషా, సీఆర్‌పీ మురళీధర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

పీలేరు, జూన్ 19: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మ దినాన్ని బుధవారం పీలేరు లోని ఎన్‌ఎస్‌యూఐ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా స్థానిక భవిత పాఠ శాలలోని విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ మాట్లాడు తూ రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరమని, ఆయన ప్రధాని అయితేనే దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాయిసంపత్, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకుడు ఎస్ రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినోత్సవాలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే బాషా, మహమ్మద్ పీర్, రవి, ఈశ్వరమ్మ, పాలేటి, నాగరాజ, రమణ, సాధిక్, తోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బి.సోమశేఖర్ రెడ్డి కేకు కట్ చేసి పంపిణీ చేశారు. శ్రీవర్ధన్ చౌదరి, మల్లిక, రహంతుల్లా పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలి

పీలేరు, జూన్ 19: అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి స్థలం కేటా యించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ స భ్యుడు తుమ్మల ధరణీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో బుధవారం జరిగిన విలేకరుల సమా వే శంలో ఆయన మాట్లాడుతూ తాము పదేళ్లుగా అంబేడ్కర్ భవన్ కోసం స్థలం కేటాయించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు చెవికెక్కించుకోవడం లేదన్నారు. అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ నుంచి ఆదేశాలు అందినా వారు ఖాతరు చేయడం లేదన్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మాలమహానాడు నాయ కులు సుభాష్, జెట్టి మల్లికార్జున, రవీంద్ర పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

తంబళ్లపల్లె, జూన్ 19: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీని వాసులు తెలిపారు. బుధవారం తంబళ్లపల్లెలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాల్లో మలాథియాన్‌ను పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ..ఖాళీ ప్రదేశాల్లో ఎక్కువ రోజుల పాటు నీరు నిల్వ ఉండటం వలన దోమ లు వృద్ధి చెందుతాయన్నారు. అవి కుడితే జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో విద్యాకిట్ల పంపిణీ

పెద్దతిప్పసముద్రం జూన్ 19 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం ప్రిన్సి పాల్ శివకుమారి, మండల విద్యాశాఖాధికారులు నారాయ ణ, గౌస్‌పీర్ విద్యాకిట్లు పంపి ణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలు పు నఃప్రారంభం కావడంతోనే విద్యాకిట్లను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందించామన్నారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు విద్యా కిట్లు సరఫరా చేసి, విద్యార్థులకు పంపిణీ చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం

రామసముద్రం, జూన్ 19: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ రామ సము ద్రం ఖండ ఆధ్వర్యంలో బుధవారం హిందూ సామ్రాజ్య దినోత్సవం నిర్వ హించారు. మండలంలోని భజరంగ్ దళ్ యువసేన, ఛత్రపతి శివాజీ అభిమానులు, నాయకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు. కాషాయ జెండాలు చేపట్టి దిగువపేట నుంచి బజారు వీధి మీదుగా ఎగువ చెక్ పోస్టు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలో చెన్నకేశవలు, మల్లికార్జునస్వామి, నాగరాజు, నాగభూషణం శెట్టి, సాయిశివాజీ, అమర, మహేష్, బీజేపీ శ్రీనివాస్, చలపతి, వినోద్, వాల్మీకి కిట్టు, బాలాజీ, నాగరాజ, బాలాజి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు

మదనపల్లె అర్బన్, జూన్ 19: పట్టణ సమీపంలోని బీకేపల్లె లో అక్రమ కట్టడాలను బుధవారం తహసీల్దార్ రమాదేవి అడ్డుకున్నారు. రికార్డులు సక్ర మంగా లేని నిర్మాణాలను ఆపించేశారు. అనంతపురం, చెన్నై జాతీయరహదారిలో బీకే పల్లె సమీపంలోని రాయల్ ఉడ్ ఫర్నిచర్ సమీపంలో ఇంతకు మునుపు అక్రమ నిర్మాణపనులు ఆపి హెచ్చరించినా ఖాతరు చేయకుండా తిరిగి పనులు ప్రారంభించినట్లు తెలియడంతో తహసీల్దార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని పనులను అడ్డుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆదేశాలను అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ఏ రికార్డులు లేకుండా బీకేపల్లెలో నిర్మిస్తున్న ఇళ్ల పనులను ఆపాలని ఆదేశించారు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె టౌన్, జూన్ 19: స్థానిక నక్కలదిన్నెతాండాలో నాటుసారా విక్రయిస్తున్న మహిళను ఎస్ఈబీ డీటీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నక్కలదిన్నెకు చెందిన గోపినాయక్ భార్య పద్మావతి(42) తన ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తుండగా డీటీఎఫ్ ఎస్ఐ హేమంత్‌కుమార్ దాడి చేసి అరెస్టు చేయడంతోపాటు, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు కోర్టు ఆదేశాలమేరకు నిందితురాలిని రిమాండుకు తరలించామన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 19: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ శేఖర్ తెలిపారు. కొత్తవారిపల్లె పంచాయతీ సోమలగడ్డకు చెందిన సుబ్రమణ్యం భార్య సరళ (29) ఈ నెల 15న పాలు తీసుకుని వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి అంజనప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ చెప్పారు.

ఐదుగురిపై కట్నం వేధింపుల కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 19: ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ యువరాజు తెలిపారు.స్థాని పుల్లారెడ్డి వీధికి చెందిన శ్రీరాములు కుమార్తె మీనాకు రెండేళ్ల క్రితం గాలివీడు మండలం, గొట్టువీడుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అశోక్‌తో రూ.20 లక్షలు నగదు, 230 గ్రాములు బంగారం ఇచ్చి వివాహం చేశారు. రెండేళ్ల తరువాత అశోక్ ఉద్యోగం పోయిందని, అదనపు కట్నం కోసం భర్త, కుటుంబసభ్యులు వేధింపులకు గురిచేస్తున్నట్లు మీనా తండ్రి శ్రీరాములు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో భర్త అశోక్, అత్త లక్ష్మీదేవి,మామ ఆంజనేయులు, బంధువులు శ్రీరాములు, అనితకుమారిలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

